# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




## రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు

శనివారం 23 నవంబరు 2024


# వామ్మో చలి..

- జిల్లాలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- కనిష్ఠం 11.7 డిగ్రీలు



సిరిసిల్ల నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. శుక్రవారం జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 11.7 డిగ్రీలు ఉండగా గరిష్ఠ ఉష్ణోగ్రత 33.2 డిగ్రీలుగా నమోదైంది. చలి తీవ్రతకు ఉదయం వేళల్లో పలు ప్రాంతాలు నిర్మానుషంగా కనిపిస్తున్నాయి పడిపోతున్న ఉష్ణోగ్రతలతో చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు కూరగాయలు తీసుకొచ్చి మార్కెట్లో అమ్ముకోవడానికి ఇబ్బంది పడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. చలి తీవ్రత అధికం అవుతుండడంతో ఉదయం సాయంత్రం వేళల్లో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. జిల్లాలో గంభీరావుపేట మండలంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 11.8 డిగ్రీలు ఉండగా సిరిసిల్ల, కోనరావుపేటలో 13.8, ఇల్లంతకుంట 13.6, చందుర్తి 13.1, ఎల్లారెడ్డిపేట 14.8, వేములవాడ రూరల్ 13.0 ముస్తాబాద్ 13.4, వేములవాడ 14.2, రుద్రంగి 13.7, బోయినపల్లి 12.9, వీర్నపల్లి 12.0, తంగళ్లపల్లిలో 12.6 డిగ్రీలుగా నమోదైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఉష్ణోగ్రతలు పడిపోయి ఎల్లో జోన్‌లో ఉండడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. దగ్గు, జలుబు, గొంతు నొప్పి, జ్వరం వంటి ఇబ్బందులు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు.



ఆలయ ఆవరణలో భక్తులు

## రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- వైభవంగా కార్తీక దీపోత్సవం

7



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్

## ఆహార పదార్థాల నాణ్యతపై దృష్టి సారించాలి

కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

8

## న్యూస్ బాక్స్

### జిల్లా విద్యాధికారిగా జగన్‌మోహన్‌రెడ్డి



సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాధికారిగా జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి డీఈవో డాక్టర్ జగన్ మోహన్‌రెడ్డిని నియమిస్తూ శుక్రవారం విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సిరిసిల్ల జిల్లా విద్యాధికారిగా పనిచేస్తున్న రమేష్ కుమార్‌ను నాగర్ కర్నూల్ జిల్లా విద్యాధికారిగా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇల్లంతకుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): : సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి అన్నారు. మండలంలోని వెల్జీపూర్‌లో శుక్రవారం మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. యువకులు వ్యసనాల బారినపడి జీవితాలను పాడు చేసుకోవద్దన్నారు. సమయాన్ని వృథా చేయకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

### గంభీరావుపేట ఎస్సైగా శ్రీకాంత్



గంభీరావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట నూతన ఎస్సైగా శ్రీకాంత్ శుక్రవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎస్సైగా పనిచేసిన శివకుమార్ కామారెడ్డికి బదిలీపై వెళ్లారు. ఎస్బీలో పనిచేస్తున్న శ్రీకాంత్ గంభీరావుపేటకు వచ్చారు. శుక్రవారం రాత్రి గంభీ రావుపేట ఎస్సైగా బాధ్యతలు తీసుకున్నారు

### ఎస్పీని కలిసిన పీపీలు

సిరిసిల్ల క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చిన సందర్భంగా శుక్రవారం ఎస్పీ అఖిల్ మహాజన్‌ను పీపీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవాలన్నారు. చర్యలపై చర్చించారు. పీపీలు ప్రసాద్, పెంట శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు .



జిల్లాలో సమగ్ర సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు

# సమాచారం.. గోప్యం

- కుటుంబ సర్వేలో జనం తీరు
- ఆస్తులు, ఆదాయం వివరాలు వెల్లడించని వైనం
- అప్పులే ఉన్నాయంటూ సమాధానం
- నామమాత్రంగా ఆధార్, కుటుంబ సభ్యుల సమాచారం
- జిల్లాలో నేటితో ముగియనున్న కుటుంబ సర్వే

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే శనివారంతో ముగియనుంది. సమగ్ర సర్వేలో ప్రజలు తమ వివ రాలను గోప్యంగానే ఉంచారు. ఆస్తులులేవు, అన్నీ అప్పులే ఉన్నాయన్న సమాధానాలే ఎక్కువగా వచ్చాయి. భూములు, పిల్లల ఉద్యోగాలు, ఆదాయ వివరాలు వెల్లడించలేదు. ఆధార్ నంబర్లు, కుటుం సభ్యుల పేర్లు నామమాత్రంగానే అందించారు. ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వివరాలు కూడా గోప్యంగానే ఉంచారు. సర్వేలో పొడిపొడిగా సమాధానాలు చెబుతూ ఎన్యూమరేటర్లను ఇబ్బందులు పెట్టారు. బలవంతంగా వివరాలు తీసుకోవద్దని ప్రభుత్వం కూడా చెప్పడంతో కళ్ల ముందు భారీ భవనాలు, వాహనాలు, స్థితిగతులు తెలిసినా చెప్పినవే రాసుకొని వెళ్లారు. కొందరు సర్వేతో తమకేం పని అంటూ సహకరించని తీరు కనిపించింది. దీంతో సమగ్ర సర్వే లక్ష్యం అనుకున్న మేరకు నెరవేరలేదని భావిస్తున్నారు.

### జిల్లాలో 95 శాతం సర్వే పూర్తి

జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శనివారంతో ముగియనుంది. ఇప్పటి వరకు జిల్లాలో 95 శాతం సర్వేను పూర్తి చేశారు. గురువారం వరకు 1,82,782 కుటుంబాల వివరాలు సేకరించారు. సిరిసిల్ల వేములవాడ మున్సిపాలిటీల్లో 377 బ్లాకుల్లో 47,460 ఇళ్లకు 45,468 ఇళ్లలో సర్వే చేశారు. గ్రామాల్లో 1154 బ్లాక్‌ల్లో 1,44,972 ఇళ్లకు 1,37,314 ఇళ్లు సర్వే చేశారు. చివరి రోజు రాత్రి 8 గంటల నుంచి ఇళ్లు,

మిగతా 8లో

జిల్లాలో సర్వే వివరాలు... (గురువారం రాత్రి వరకు)

| మండలం | బ్లాకులు | ఇళ్లు | సర్వే పూర్తైనవి |
| --- | --- | --- | --- |
| రుద్రంగి | 39 | 5182 | 4633 |
| చందుర్తి | 76 | 11,442 | 11,117 |
| వేములవాడరూరల్ | 57 | 8146 | 7811 |
| బోయినపల్లి | 104 | 12,414 | 11,549 |
| వేములవాడ | 48 | 6657 | 6550 |
| కోనరావుపేట | 117 | 14,736 | 13,144 |
| వీర్నపల్లి | 64 | 4487 | 4520 |
| ఎల్లారెడ్డిపేట | 122 | 16,992 | 15,808 |
| గంభీరావుపేట | 115 | 14,254 | 13,745 |
| ముస్తాబాద్ | 131 | 16,219 | 15,131 |
| తంగళ్లపల్లి | 127 | 16,645 | 16,065 |
| ఇల్లంతకుంట | 154 | 17,798 | 17,241 |
| సిరిసిల్ల మున్సిపల్ | 231 | 31,588 | 29,968 |
| వేములవాడ మున్సిపల్ | 146 | 15,872 | 15,500 |
| మొత్తం | 1531 | 1,92,432 | 1, 82,782 |

# వాటర్, సానిటేషన్ మిషన్ లక్ష్య సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : జిల్లా వాటర్ సానిటేషన్‌మిషన్ లక్ష్య సాధనకు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా వాటర్ సానిటేషన్ మిషన్‌కు సంబంధించిన అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరల్డ్ టాయిలెట్ డేకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా విభాగాలను పర్యవేక్షించేందుకు వాటర్ సానిటేషన్ మిషన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్, జల్ జీవన్‌మిషన్ కార్యక్రమాలను జిల్లా వాటర్ సానిటేషన్ మిషన్ పర్యవేక్షిస్తుందన్నారు. మన జిల్లాను ఓడీఎఫ్‌గా ప్రకటించామని, దీనిని నిలబెట్టే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టే నూతన ఇళ్ల నిర్మాణాలకు మరుగుదొడ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. గ్రామాలను ఓడీఎఫ్ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పనిచేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా జరగాలని, ప్రతి గ్రామంలో నిర్మించిన కంపోస్ట్ షెడ్, సామూహిక ఇంకుడు గుంతల పూర్తిస్థాయిలో వినియోగించా లన్నారు. మండల స్థాయిలో పారిశుధ్యంపై సమావేశం నిర్వహించాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం, డీపీఆర్‌వో శ్రీధర్, ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ జానకి పాల్గొన్నారు.




పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

## అభివృద్ధి పనులకు నిధులు

రుద్రంగి నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రుద్రంగిలో అభివృద్ధి పనుల కోసం 6 కోట్ల 50 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. సూమారు నాలుగు నెలల క్రితం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గ్రామంలో ప్రభుత్వాస్పత్రి భవనానికి భూమి పూజ చేశారు. సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రుద్రంగిలో కోరుట్ల - వేములవాడ ప్రధాన రహదారి ఎత్తు పెరగడంతో వర్షం నీరు దుకాణాల్లోకి రాకుండా రూ.కోటి 50 లక్షలతో నూతనంగా డ్రైనేజీని నిర్మించారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కోసం రూ. కోటి 42 లక్షలు, రుద్రంగిలో అంబేద్కర్ చౌరస్తా, హనుమాన్ ఆలయం నుంచి ఇందిరా చౌక్ రింగ్ రోడ్డుకు రూ. కోటి 50 లక్షలు, రామకిష్టపూర్ పల్లె వెళ్లేందుకు లోలేవల్ వంతెన నిర్మాణం కోసం రూ.62 లక్షలు, సెంట్రల్ లైటింగ్ మరమ్మతు కోసం రూ. 16 లక్షలు, దసరా నాయక్ తండా రోడ్డుకు రూ. 28 లక్షల సీసీ రోడ్డు, 8 బోరు బావుల ఏర్పాటుకు రూ. 12 లక్షలు, సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ. 44 లక్షలు, శ్మశాన వాటిక-2 నిర్మాణం కోసం రూ.13 లక్షలు, విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా కేజీబీవీ పాఠశాల భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం రూ.7.50 లక్షలు మంజూరవగా పనులు కొనసాగుతున్నాయి.

## నేడు గంభీరావుపేటకు బండి సంజయ్ రాక

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

గంభీరావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేటకు శనివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ రానున్నారు. రూ.20 కోట్ల రూపాయల కేంద్రం నిధులతో నిర్మించిన అభివృద్ధి పనులను బండి సంజయ్ ప్రారంభించనున్నారు. గంభీరావుపేట- మల్లారెడ్డిపేట మధ్య మానేరు వాగుపై నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని, కొరుట్లపేట నుంచి మల్లారెడ్డిపేట మీదుగా లింగన్నపేట వరకు నిర్మించిన బీటీ డబుల్ రోడ్డును బండి సంజయ్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు లింగన్నపేట గ్రామానికి బండి సంజయ్‌కుమార్ చేరుకొని బీటీ డబుల్ రోడ్డును ప్రారంభిస్తారు. 11 గంటలకు మల్లారెడ్డిపేట వీరజనేయస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకుంటారు. ప్రత్యేక పూజలు చేస్తారు. 12 గంటలకు గంభీరావుపేట- మల్లారెడ్డిపేట మధ్య మానేరు వాగుపై నిర్మించిన నూతన బ్రిడ్జిని ప్రారంభిస్తారు. అక్కడి నుంచి 1 గంటకు తాళ్ల ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని బండి సంజయ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ రాక సందర్భంగా జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపీ, బీజేపీ మండల అద్యక్షుడు గంట అశోక్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.



గంభీరావుపేట- మల్లారెడ్డిపేట మధ్య నిర్మించిన బ్రిడ్జి

# సూరమ్మ ప్రాజెక్టు కోసం ఎన్నో పోరాటాలు

- ప్రాజక్టు పనులకు భూమి పూజ చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కలికోట సూరమ్మ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఆనాడు ప్రతిపక్షంలో ఎన్నో రాజీలేని పోరా టాలు చేశామని, నేడు అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఇచ్చిన మాట ప్రకారం పను లను ప్రారంభించడం సంతోషంగా ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నా రు. రుద్రంగి మండల కేంద్రం శివారులోని కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 43 ఎకరాలకు నీరు అందిస్తామని ప్రాజెక్టును పడావు పడేలా చేశారన్నారు. 10 సంవత్సరాలు బీఆర్ ఎస్ అధికారంలో ఉండి తట్టెడు మట్టి కూడా తీయ లేదని, 2018 ఎన్నికల్లో తనను ఓడించడానికి హరీష్ రావు ప్రాజెక్టు నిర్మాణానికి భూమి పూజ చేసి వదిలేశారన్నారు. 37 నెలల పాటు ప్రతీ నెల 22వ తేదీన నిరసనలు తెలిపినట్లు చెప్పారు. అధికారంలోకి వచ్చిన తరువాత అదే 22వ తేదీన ప్రాజెక్టుకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించుకున్నామన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి సూరమ్మ చెరువును సందర్శించారని గుర్తు చేశారు. వచ్చే సంవత్సరం మార్చి వరకు కట్ట పనులు పూర్తవు తాయన్నారు. వేములవాడ నియోజకవర్గంలో రూ. 1000 కోట్లతో పలు అభివృద్ధి పనులకు మూడు రోజుల క్రితం ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారన్నారు. ప్రాజెక్టులో నష్ట పోయిన ప్రతీ రైతును ఆదుకుంటామన్నారు. రుద్రంగికి ఏటీసీ కళాశాల మంజూరు, మేడిపల్లి మండ లానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూ రయ్యాయన్నారు. ఇరిగేషన్ ఈఈ సంతూ ప్రకాష్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, తర్రె మనోహర్, ఎర్రం గంగ నర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, కేసిరెడ్డి నర్సరెడ్డి, కొమిరె శంకర్, మాడిశెట్టి అభిలాష్, పల్లి గంగాధర్, ఇప్ప మహేష్, తర్రె లింగం, స్వర్గం పరంధామ్, పిడుగు లచ్చిరెడ్డి, గుగ్గిళ్ల వెంకటేశం, పూదరి మహిపాల్, పోగుల మహేష్, సూర యాదయ్య, దసారి గంగారాజం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఆది శ్రీనివాస్

## నేడు 'కథా కచ్చీరు' సంకలనం ఆవిష్కరణ

సిరిసిల్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ వెల్దండి శ్రీధర్ రాసిన 'కథా కచ్చీరు' తెలంగాణ కథా సాహిత్య విమర్శ సంకలనం శనివారం రవీంద్రభారతిలో ఆవిష్కరించనున్నారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కాశీం, ఆచార్య వెల్దండ నిత్యానందరావు, ఆవిష్కర్తగా డాక్టర్ కె శ్రీనివాస్, డాక్టర్ మామిడి హరికృష్ణ హాజరుకానున్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో 1973లో జన్మించిన డాక్టర్ వెల్దండి శ్రీధర్ ఉద్యోగ ప్రస్థానం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో తెలుగు పండితుడిగా మొదలైంది. తెలుగు ఉపాధ్యాయుడిగా సిరిసిల్లలోని మానేరు రచయితల సంఘంతో సాహిత్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ప్రస్తుతం నల్లగొండ జిల్లాలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు 22 కథలు రాశారు. ఆయన సంపాదకత్వంలో పడుగు పేకలు చేనేత కథలతోపాటు తెలంగాణ ఉత్తమక కథలు, ఉద్యమ కవిత్వంపై సంకలనాలు వెలువరిచారు.

## జ్వరంతో బాలుడి మృతి

భీమారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలో శుక్రవారం జ్వరంతో బాలుడు మృతి చెందాడు. భీమారం మండల కేంద్రానికి చెందిన ముంజ జలంధర్-శిరీషల కుమారుడు రిషి (13) కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. కుటుంబ సభ్యులు నాలుగు రోజుల క్రితం కోరుట్ల ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం రిషిని కరీంనగర్ ఆస్పత్రికి శుక్రవారం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.


రిషి (ఫైల్)

## అనుమతి లేని ఇసుక లారీ పట్టివేత

మెట్‌పల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గురువారం అర్ధరాత్రి అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక లారీని పట్టుకుని సీజ్ చేసినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలో అర్ధరాత్రి సమయంలో ఎఎస్ఐ సత్తయ్యతో కలిసి పోలీసు బృందం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కోరుట్ల నుంచి నిజామాబాదు వైపు ఇసుక లోడుతో వెళుతున్న లారీ ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలను లేవని తెలపడంతో లారీని పోలీసు స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లారీని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. లారీ ఓనరైన అర్మూర్ పట్టణానికి చెందిన రజనీకాంత్ రెడ్డితో పాటు డ్రైవర్ ధారవేణి భూమయ్యపై కేసు నమోదు చేశారు.

## రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక జ్యోతి ఐఐటీ అకాడమీకి చెందిన 9వ తరగతి విద్యార్థి సంజన రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు తెలిపారు. నెల 21వ తేదీన చొప్పదండిలో జరిగిన ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి అండర్ 17 నెట్ బాల్ పోటీల్లో గెలుపొంది, ఈ నెల 23నుంచి 5వ తేదీ వరకు మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్ర నెట్ బాల్ పోటీలకు ఎంపికైందన్నారు. పాఠశాల డైరెక్టర్‌లు హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనిక రావు, అజితరావు, రజితరావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## కంకర వేశారు.. తారు మరిచారు

### ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


మొగిలిపేటలో కంకర దుమ్ముతో కూడిన రహదారి

మల్లాపూర్, నవంబరు, 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రహదారిల పునరుద్ధరణలో భాగంగా మండలంలోని మొగిలిపేట ప్రధాన రహదారి గుంతలమయంతో ప్రమాదకరంగా మారడంతో మరమ్మతులకు నిధులు మంజూరు చేశా రు. కానీ రోడ్డు నిర్మాణం కోసం కంకర పోసి తారు మరవడంతో దుమ్ము, దూలి, గుంతలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల పాల్పడుతున్నారు. ప్రతి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, వేల సంఖ్యలో ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. గుంతల మయంగా మారిని రహదారిపై మరమ్మతుల కింద 45 రోజుల క్రితం కంకర పోసి వదిలేశారు. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

# అపార్ కార్డులు తప్పని కష్టాలు






- పాఠశాల రికార్డులతో సరిపోలని ఆధార్ వివరాలు
- చాలా మంది విద్యార్థుల వ్యక్తిగత వివరాల్లో తేడాలు

వెల్గటూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న ఒకటవ తరగతి నుంచి 12వ తరగతి వరకు గల విద్యార్థులకు ఆపార్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. వన్ నేషన్ వన్ కార్డులో భాగంగా ఆటో మేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) పేరుతో 12 అంకెల సంఖ్యతో కార్డు జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు వీటిని జారీ చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో అన్ని పాఠశాలల నుంచి విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో సేకరించే కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థుల పురోగతిని అంచనా వేయడానికి ఇది ఉపయోగపడు తుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే విద్యార్థులకు ఆధార్ నెంబర్, పెన్ నెంబరు కేటాయించినప్పటికీ, దేశవ్యాప్తంగా విద్యార్థికి అపార్ పేరుతో మరోనెంబర్ కేటాయించే కార్యక్రమం ప్రారంభించారు.

### నత్త నడకన నమోదు

నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి జీవితకాల గుర్తింపు సంఖ్యతో ఆపార్ కార్డు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 1165 ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో కలిపి 1,60,152 మంది విద్యార్థులకు ఆపార్ కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ జిల్లాలో నమోదు ప్రక్రియ నత్త నడకన సాగుతున్నట్లు అధికారిక లెక్కలే తెలుపుతున్నాయి. జిల్లాలో 109 పాఠశాలలు మాత్రమే కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించగా మొత్తం మీద కేవలం సుమా రు 5 వేల మంది విద్యార్థుల నమోదు ప్రక్రియ మాత్రమే పూర్తి అయినట్లు తెలుస్తోంది. కార్డుల జారీకి కష్టాలు తప్పడం లేదు.

### రికార్డులకు సరిపోలని వివరాలు

చాలా మంది విద్యార్థుల వివరాలు పాఠశాల రికార్డుల్లో ఒక రకంగా ఉండగా ఆధార్ కార్డుల్లో మరో రకంగా ఉంటున్నాయని ప్రధానోపాధ్యాయులు తెలుపుతున్నారు. కొంత మంది వివరాలు మాత్రమే ఆధార్ కార్డులతో సరిపోతున్నాయని తెలుస్తోంది.

పిల్లలు చిన్న తనంలో ఉన్నపుడు ఆధార్ తీయడంతో ఆధార్ నమోదులోనే ఎక్కువగా తప్పులు ఉంటున్నాయని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నారు. విద్యార్థులకు అపార్ నెంబరు ఆన్‌లైన్‌లో కేటాయిం చాలంటే విద్యార్థి జనన ధ్రువీకరణ పత్రంలో గల వివరాలకు, ఆధార్‌లో ఉన్న వివరాలకు, పాఠశాల అడ్మిషన్ రికార్డులో గల వివరాలకు సరిపోవాలి. మూడింటి వివరాలు సరి పోతేనే ఆపార్ నెంబర్లు జనరేట్ అవుతున్నాయి. ఈ మూడింటిలో విద్యార్థుల వివరాలు సరిపోకపోతే ఆ విద్యార్థికి ఆన్ లైన్‌లో ఆపార్ నెంబరు జనరేట్ కావడం లేదు. దీంతో ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకునే పరిస్థితి వచ్చింది.

### ఆపార్ నమోదు కొనసాగుతుంది

**మండల విద్యాధికారి ప్రభాకర్**



విద్యాశాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండలంలో ఆపార్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. కొన్ని సాంకేతిక కారణాల వలన ఆన్ లైన్ మందకొడిగా సాగుతోంది. విద్యార్థుల అన్ని వివరాలు సరిపోలితేనే ఆపార్ జనరేట్ అవుతుంది. త్వరితగతిన పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం.

## ఎదురెదురుగా ఢీకొన్న లారీలు

- క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్లు
- ముగ్గురికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు


ప్రమాద స్థలంలో డ్రైవర్లను బయటకు తీస్తున్న పోలీసులు

మల్యాల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు సమీపంలో శుక్ర వారం వేకువజామున ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాల య్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్ నుంచి కరీంనగర్ వైపు వెలుతున్న లారీ, ఆంధ్ర ప్రదేశ్‌లోని ఎన్టీయార్ జిల్లా నుంచి పత్తి లోడ్‌తో జగిత్యాల వైపు వస్తున్న లారీ రెండు కొండగట్టు సమీపంలో ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రెండు లారీల ముందు భాగాలు నుజ్జు నుజ్జు కావడంతో క్యాబిన్‌లో డ్రైవర్లు దేవీలాల్, వీరయ్యలు ఇరుక్కు పోయారు. దీంతో పలువురు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు జేసీబీ సహాయంతో క్యాబిన్‌లో ఇరుక్కొని తీవ్ర గాయాలపాలైన డ్రైవర్లను బయటకు తీశారు. వారితో పాటు లారీలో గల మరో వ్యక్తి శ్రీనివాస్ రెడ్డికి కూడా గాయాలు కాగ గాయపడిన వారిని చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

## సిగరెట్ తాగవద్దన్నందుకు

### ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య

కోనరావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు సిగరెట్ తాగవద్దన్నారని పదో తరగతి విద్యార్థి శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన అలువాల వెంకటేష్ (16) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కొద్ది రోజులుగా సిగరెట్‌కు అలవాటు పడ్డాడు. ఈ విషయమై గతంలో తల్లిదండ్రులు మందలించగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స చేయించడంతో కోలుకున్నాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులు, స్నేహితులతో ముభావంగా ఉంటున్నాడు. గురువారం సిగరెట్ తాగవద్దని, చదువుకోవాలని తల్లిదండ్రులు సూచించారు. దీంతో తరుచూ తనను సిగరెట్ తాగవద్దంటున్నారని కోపంతో శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ రెడ్డి ఉన్నారు.


ఆటోను బయటకు తీస్తున్న పోలీసులు

## ఘాట్‌రోడ్డుపై అదుపు తప్పిన ఆటో

- విద్యుత్ స్థంభానికి ఢీ
- అంజన్న దర్శనం చేసుకొని వెలుతుండగా ఘటన

మల్యాల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజన్న దర్శనం చేసుకొని తిరిగి వెలుతున్న భక్తుల ఆటో ఘాట్ రోడ్డుపై అదుపు తప్పి విద్యుత్‌స్థంబానికి ఢీకొంది. మంచిర్యాల జిల్లాలోని మందమర్రికి చెందిన ఓ కుటుంబం దైవదర్శనం నిమిత్తం కొండగట్టుకు వచ్చి వెలుతుండగా గతంలో ఆర్టీసీ బస్సు ప్రమాదం జరిగిన చోట ఆటో అదుపుతప్పి ఘాట్‌రోడ్డు పక్కన గల విద్యుత్‌స్థంభానికి ఢీకొని గతంలో ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన రక్షణగోడ వద్ద నిలిచింది. ఈ ప్రమాదంలో ఆటోలో గల వారందరూ క్షేమంగా బయటపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆటోను జేసీబీ సహాయంతో రక్షణగోడ నుంచి లాగి బయటకు తీశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- సీఎం సభ ముట్టడికి బీసీ సంఘం పిలుపు
- పలు పార్టీల మద్దతు కోరుతున్న నాయకులు

గణేశ్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కరీంనగర్‌లో జరిగే సీఎం సభ ముట్టడికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో పలు రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు ప్రతిపక్ష నాయకులకు విద్యార్థుల సమస్యలు వివరిస్తూ గత 3 సంవత్సరాల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని దీనివలన విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేసి విద్యార్థుల ఇబ్బందులు తొలగిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా ఇప్పటికీ ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదని తెలిపారు. మూసీ సుందరీకరణ చేస్తామని చెప్పే ప్రభుత్వం విద్యార్థులను మాత్రం గాలికి వదిలేస్తున్నదన్నారు. కరీంనగర్‌లో త్వరలో జరుగనున్న సీఎం సభను బీసీ సంక్షేమ సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. దీనికి పలు రాజకీయ పార్టీలు వారి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు హామీ ఇచ్చారన్నారు. యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్‌రాజు ఆధ్వర్యంలో పలు రాజకీయ పార్టీల మద్దతు కోరారు.

## వ్యవసాయ మోటార్ల చోరీ

ఇల్లంతకుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్‌లో వ్యవసాయ బావుల వద్ద నుంచి ఇద్దరు రైతులకు చెందిన మోటార్లు చోరీకి గురయ్యాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, కేతిరెడ్డి రాంరెడ్డి వ్యవసాయ బావుల వద్ద గదులు నిర్మించుకొని వ్యవసాయ పరికరాలు అందులో ఉంచారు. గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి తాళాలు పగలగొట్టి వ్యవసాయ మోటార్లు, పంపులు, విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్లారు. మరో రైతు కేతిరెడ్డి మధుసూదన్‌రెడ్డికి చెందిన గది తాళాలు పగలగొట్టడానికి ప్రయత్నించారు. దాదాపు 1.30 లక్షల మోటార్లు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు.

# అంజన్న హుండీల లెక్కింపులో నిర్లక్ష్యం..



మల్యాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీల లెక్కింపు సందర్భంగా పర్యవేక్షణపై నిర్లక్ష్యం కనబడుతోంది. తరచూ దొంగతనాలు చోటు చేసుకుంటున్నప్పటికీ లోపాలు సరిద్దికపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా గురువారం హుండీల లెక్కింపు చేపట్టగా నోట్ల లెక్కింపు పూర్తి అయ్యాక అనుమానం వచ్చిన కొందరి అభ్యంతరం మేరకు మళ్లీ లెక్కింపు చేయడంతో సుమారు రూ. పది వేల వరకు ఎక్కువ వచ్చిన్నట్లు కొండపై చర్చించు కుంటున్నారు. కోటికి పైగా ఆదాయం రాగా అందులో 90శాతం నోట్లు ఉంటాయి. ఈ రకంగా మొత్తం లెక్కింపు చేపట్టిన నోట్లను రీకౌంటింగ్ చేస్తే ఇంకా ఎక్కువగా నోట్లు రావచ్చుననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే ఆలయ సిబ్బం ది ఒకరు చేతిలో వస్తువులను ఉంచు కోవడంతో అక్కడి మిగితా సిబ్బందికి అనుమానం రాగా గుర్తించిన అత ను దాన్ని కౌంటింగ్ డబ్బాలో వేశాడని, కొందరు దాన్ని ఫొటోలు కూడా తీసినట్లు చర్చించుకుంటున్నారు.

ఆయన చేతిలో ఉన్న దానిని బంగారంగా అనుమా నిస్తున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో రామకృష్ణ రావును ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా అందుబాటులో లేరు. గతంలోనూ లెక్కింపు సమయంలో సిబ్బంది

### నోట్ల లెక్కింపులోనూ పర్యవేక్షణ కరువు

చేతివాటానికి పాల్పడిన సంఘటనలు ఉండగా కౌంటిం గ్ ప్రక్రియపై తరచూ విమర్శలు వస్తూనే ఉన్నాయి. హుండీల కౌంటింగ్ సందర్భంగా దేవస్థానం అధికారులు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, సీసీ కెమెరాల పర్యవేక్షణలో దేవస్థానం అధికారులకు తోడు పోలీసుల సమక్షంలో కౌంటింగ్ చేపడుతుంటారు. ఈ లెక్కింపునకు వివిధ ట్రస్ట్‌లకు సంబంధించిన సిబ్బంది నోట్లు లెక్కింపు, నోట్లు వేరు చేస్తుండగా పర్యవేక్షణ అంతంతమాత్రమేనని అందుకే తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

## ప్రతిభ చాటిన విద్యార్థినికి అభినందన


రష్మితను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

హుజూరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న నల్లగొండ రష్మిత అనే విద్యార్థిని 10 కిలో మీటర్ల ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ క్రాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్ ఈవెంట్లో ప్రతిభ చాటడంతో శుక్రవారం ప్రిన్సిపాల్ ఇందిరాదేవి అభినందించారు. రష్మిత శాతవాహన యూనివర్సిటీ తరుపున గురువారం కర్ణాటకలోని మంగళూరు యూనివర్సిటీలో నిర్వహించిన క్రీడా పోటీలో పాల్గొన్నది. ప్రతిభ చాటిన రష్మితను కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, సమన్వయకర్త మంగమ్మ, వైస్ ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, అధ్యాపకులు లింగారెడ్డి, రేణుక, మైపాలొరెడ్డి, ఓదెలు, ఝాన్సీరాణి, సుమలత, స్వరూపరాణి, రమ, పల్లవి, స్వప్న అభినందించారు.

## 24న రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం సమావేశం

సుభాష్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం సమావేశాన్ని ఈ నెల 24న నిర్వహించను న్నట్లు సంఘం ప్రధానకార్యదర్శి మహేందర్ రాజు తెలిపారు.

శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం మొదటి విడత సమావేశం వరంగల్‌లో, రెండో విడత సమావేశాన్ని కరీంనగర్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. మానకొండూరులో నిర్వహించే ఈ సమావేశంలో కార్యవర్గ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. అంతే కాకుండా సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న సమస్యలు, సంఘం ఆధ్వర్యంలో చేపట్టబోయే భవిష్యత్ కార్యక్రమాల గురించి చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో సలహాదారుడు బుచ్చిరెడ్డి, చక్రపాణి, రాజగోపాల్, మధుసూదన్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రాజు

## దాడి ఘటనలో కేసు నమోదు

కరీంనగర్ క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ భారత్ టాకీస్ వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన దాడి ఘటనలో నిందితులపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ సిఐ బిల్లాకోటేశ్వర్ తెలిపారు. పెళ్లి భరత్‌లో జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకొని సాహిత్ యాదవ్ అనే వ్యక్తి తన సోదరుడు రిచు, మరో ముగ్గురి స్నేహితులతో కలిసి చింతల విజేందర్ రెడ్డి అనే వ్యక్తిపై కె ఎస్ఎల్ లాడ్జి కారిడార్‌లో రాడ్డుతో ముఖం మీద దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. అడ్డు వచ్చిన వారిని కూడా కొట్టాడని, ఈ మేరకు బాధితుడు విజయేందర్‌రెడ్డి శుక్రవారం ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఈ దాడి ఘటనలో నిందితులైన ఐదుగురు వ్యక్తుల పై కేసు నమోదు చేశామన్నారు.

## డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజులు జైలు శిక్ష

సైదాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ హుజూరాబాద్ కోర్టు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఈశ్వరయ్య శుక్రవారం తీర్పునిచ్చారు. సైదాపూర్ ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా సైదాపూర్ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి బండి నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని కోర్టులో హాజరు పరుచగా మూడు రోజుల జైలు శిక్ష విదించినట్లు ఎస్సై తెలిపారు.


చెక్కును అందిస్తున్న వధూవరులు

## సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఔదార్యం

### ప్రభుత్వ పాఠశాలలో వాటర్ కూలర్ల కోసం రూ.50 వేల విరాళం

సుల్తానాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తన వివాహన్ని పురస్కరించుకుని ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ విరాళం ప్రకటించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం రెండు వాటర్ కూలర్లను సమకూర్చుకునేందుకు యాభై వేల రూపాయలను అందించారు. సుల్తానాబాద్‌కు చెందిన బూడిద స్వామి కరీంనగర్ ఆర్టీసీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఆయన కుమారుడు ప్రియతమ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హైదరాబాద్‌లో పని చేస్తున్నారు. ప్రియతమ్ వివాహం పురస్కరించుకుని వారు స్థానిక ప్రభుత్వ పాఠశాలకు రెండు వాటర్ కూలర్లను సమకూర్చాలని భావించారు. ఈ మేరకు వివాహ వేడుక వేదికపైన సంబంధిత ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారదకు యాభై వేల రూపాయల చెక్కును శుక్రవారం నూతన దంపతులు ప్రియతమ్- షరిష్మాలు అందజేశారు. హెచ్‌ఎంతో పాటు వేదికపై ఉన్న మాజీ జడ్పీటీసీ అయిల రమేష్, మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ బిరుదు సమత క్రిష్ణ అభినందించారు.

## రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాజన్న ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్న ఆలయంలోని గండదీపంలో నూనేపోస్తూ గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమపూజలో పాల్గొని, బద్దిపోచమ్మను దర్శించుకొని తిరిగి ప్రయాణమయ్యారు. ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## రాజన్నను దర్శించుకున్న మధుప్రియ



సింగర్ మధుప్రియకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని సింగర్ మధుప్రియ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఆమె వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## రామగుండంకు నర్సింగ్ కళాశాల

**- రూ.26కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ**



సింగరేణి మెడికల్ కళాశాల

కళ్యాణ్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రామగుండంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏర్పాటు కానున్నది. నర్సింగ్‌కళాశాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవో నంబరు 183ను జారీ చేసింది. ఏడాదికి 60సీట్ల కెపాసిటీతో ఈ కళాశాలను ఏర్పాటు చేస్తున్నారు. సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్) కు అనుబంధంగా ఈ కళాశాల ఏర్పాటు కానున్నది. ఈ మేరకు శుక్రవారం వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టియానా జెడ్ చుగుంత్ ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎంఎస్‌ఐడీసీ) ఆధ్వర్యంలో నిర్మాణం జరుగనున్నది. కళాశాల నిర్మాణం, సామాగ్రి కొనుగోలుకు రూ.26కోట్లు మంజూరు ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరం నుంచే కళాశాల నిర్వహించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్, బీడీఎస్, పారా మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గతంలో విజ్ఞప్తి చేశారు. డెంటల్ కళాశాల కూడా మంజూరయ్యే అవకాశం ఉన్నది.

# ఒగ్గుకథలో దిట్ట..

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన గోపగోని చంద్రమౌళిగౌడ్.. కులవృత్తికి భిన్నంగా ఒగ్గుకథలపై మక్కువ పెంచుకున్నాడు. అప్పట్లో అంతర్జాతీయ ఒగ్గుకథ కళాకారుడు మిద్దెరాములును స్ఫూర్తిగా తీసుకున్నాడు. తన అన్న వద్ద ఒగ్గుకథలు చెప్పడం నేర్చుకున్నాడు. గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాల్లో ఒగ్గుకథను ప్రదర్శిస్తూ ఎన్నో ఏళ్లుగా ప్రశంసలందుకుంటున్నాడు.

- మిద్దెరాములు స్ఫూర్తితో కళాసాధన.. వేల సంఖ్యలో ప్రదర్శనలు..
- ఉత్తమ కళాకారుడిగా గోపగోని చంద్రమౌళిగౌడ్‌కు జాతీయస్థాయి అవార్డు





ఒగ్గుకథను ప్రదర్శిస్తున్న చంద్రమౌళిగౌడ్

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన గోపగోని చంద్రమౌళిగౌడ్ ఒగ్గుకథ కళాకారుడిగా రాణిస్తున్నాడు. 20 ఏళ్ల వయస్సులో మిద్దె రాములు స్ఫూర్తితో చంద్రమౌళిగౌడ్ ఒగ్గుకథ నేర్చుకున్నాడు. చిన్నతనంలోనే జానపద గేయాలు పాడే చంద్రమౌళి ఒగ్గుకథ నేర్చకోవాలని ఆలోచనతో మిద్దె రాములును స్ఫూర్తిగా తీసు కున్నాడు. ఒగ్గు కథ కళాకారుడైన తన అన్న గోపగోని ఓదెలు వద్ద శిష్యరికం చేసి ఒగ్గు కథను నేర్చుకున్నాడు. తర్వాత బృందాన్ని ఏర్పాటు చేసుకొని గత 26 సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా రెండు వేలకు పైగా ప్రదర్శనలిచ్చి ప్రజల మన్ననలు పొందాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఒగ్గు కథ ద్వారా ప్రజల్లో చైతన్యం నింపి ప్రజా గాయకుడు గద్దర్ ప్రశంసలందుకున్నాడు.

అప్పట్లో హైదరాబాద్ జరిగిన కళోత్సవాల్లో ఒగ్గు కథ చెప్పి ఉత్తమ ఒగ్గుకథ అవార్డును అప్పటి ప్రభుత్వ సలహాదారుడు కేవీ రమణ చారి చేతుల మీదుగా అందకున్నాడు. ప్రభుత్వ కార్య క్రమాలు, ఎయిడ్స్, అక్షరాస్యత, కుటుంబ నియం త్రణ, మద్య పాన నిషేదంపై ప్రభుత్వం నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొని పలువురి ప్రశంసలు అందుకున్నాడు. చంద్రమౌళిగౌడ్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. స్వగ్రామంలో ఓ వైపు హోటల్ నడిపించుకుంటూ మరోవైపు గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాల్లో చంద్రమౌళిగౌడ్ ఒగ్గు కథ ప్రదర్శనలు ఇస్తున్నాడు.

**న్యూస్ బాక్స్**

## గోదావరి మహా హారతి పోస్టర్ ఆవిష్కరణ

ధర్మపురి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఎదుట గోదావరి మహాహారతి వాల్ పోస్టర్‌ను ఉత్సవ సమితా రాష్ట్ర కో కన్వీనర్ దామెర రాంసుధాకర్‌రావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంసుధాకర్‌రావు మాట్లాడుతూ ధర్మపురి క్షేత్రంలో 13 ఏళ్లుగా గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 30 శనివారం సాయంత్రం జరిగే గోదావరి మహా హారతి కార్యక్రమానికి విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠా ధిపతి, పూజ్య శ్రీ అతిథేశ్వరానంద పర్వత హాజరవుతారని పేర్కొన్నారు. బ్రహ్మశ్రీ పాలెపు భరత్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి రాష్ట్ర కన్వీనర్ లింగంపెల్లి వీరగోపాల్, కో కన్వీనర్ బల్గూరి సంతోష్‌రావు హాజరవుతారని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గోదావరి హారతి ఉత్సవ సమితి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, సభ్యులు సురేం దర్‌రెడ్డి, నర్సింహమూర్తి, లక్ష్మీనర్సయ్యగౌడ్, వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు కస్తూరి రాజన్న, సంగి నర్సయ్య పాల్గొన్నారు.

## మిడ్ మానేరు నిర్వాసితులను కేసీఆర్ ప్రభుత్వం మోసగించింది

**- కాంగ్రెస్ ప్రభుత్వమైన ఆదుకోవాలి - సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు**





మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు

సిరిసిల్ల టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మిడ్ మానేరు నిర్వాసితులకు ఇళ్లు నిర్మించుకోవడం కోసం గత కేసీఆర్ ప్రభుత్వం రూ. 5లక్షల 4వేలు ఇస్తామని మాట ఇచ్చి మోసం చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వేణు మాట్లాడారు. మిడ్ మానేరు కోసం 12 వేల కుటుంబాలు ఇళ్లు, వ్యవసాయ భూములు కోల్పోయారని 25 టీఎంసీల నీటి నిల్వకు సహకరించిన నిర్వాసిత కుటుం బాలను ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. త్యాగాలు చేసిన మిడ్ మానేరు నిర్వాసితులను గత కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. నిర్వాసితులందురు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకొని వేములవాడ, మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం కృషి చేశారన్నారు. మిడ్ మానేరు నిర్వాసితులందరికీ రూ. 5లక్షల 4వేలు ఇవ్వాలన్నారు. 1200వేల మంది నిర్వాసిత కుటుంబాలు ఉంటే కేవలం 4,696 మంది కుటుంబాలకే ఇవ్వడం అనేది బాధాకరమన్నారు. అప్పులు చేసి ఇళ్ల నిర్మాణం చేసుకున్న కుటుంబాలు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఇళ్లు నిర్మించుకోవడానికి జీవో ఉన్న విషయాన్ని ప్రభుత్వం మరిచిపోవద్దన్నారు. తరతరాలకు నీరు అందించే మిడ్ మానేరు నిర్మాణం కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5 లక్షల 4 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులకు రావాల్సిన కుటుంబ ప్యాకేజీ రూ.2 లక్షలు, నిరుద్యోగ భృతి తక్షణమే ఇవ్వాలన్నారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళలు చేపడతా మన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, సోమ నాగరాజు, శ్రావణపల్లి మల్లేశం, బాచుపల్లి శంకర్ పాల్గొన్నారు.

## 21వ రోజు ఘనంగా గోదావరి హారతి



ధర్మపురి వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి హారతి 21వ రోజు శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు క్రీడాపాఠశాల విద్యార్థులు



క్రీడాపాఠశాల విద్యార్థులతో కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 అథ్లెటిక్స్ పోటీలకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని క్రీడాపాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల ఖమ్మం, హనుమకొండలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో క్రీడా పాఠశాల విద్యార్థులు దీపిక, రేవతి, వైశాలి, జాహ్నవి పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 26 నుంచి 30 వరకు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారు.

- ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన నెల్లి అనిహశ్రీ రాజ్‌కోట్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. జాతీయస్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులను ఉత్తేజపరి చేందుకు కలెక్టర్ లగేజ్ బ్యాగులను అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, అథ్లెటిక్స్ కోచ్ పవన్, స్విమ్మింగ్ కోచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## స్కానింగ్ సెంటర్లలో అధికారుల తనిఖీలు



తనిఖీ చేస్తున్న అధికారులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం వసంతరావు ఆధ్వర్యంలో శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజలి జిల్లా పరిధిలోని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్లలోని రికార్డులను, ఆడిట్ రికార్డులను, రిపోర్ట్‌లను పరిశీలించారు. నిబంధనలు అనుసరించి స్కానింగ్ సెంటర్లను నిర్వహించాలని సూచించారు. స్కానింగ్ మిషన్లను సర్టిఫికెట్లలో రిజిస్ట్రేషన్ తప్ప నిసరిగా ఉండాలని లేకుంటే స్కానింగ్ మిషన్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీలలో హెచ్‌ఈ బాలయ్య, సీహెచ్‌వో బాలచంద్రం పాల్గొన్నారు.

## నేటి పరిస్థితుల్లో కరాటే మార్షల్ ఆర్ట్స్ తప్పనిసరి

**- మహిళలకు ఆత్మరక్షణ క్రీడగా కరాటే - సినీ హీరో సుమన్ - ప్రారంభమైన జాతీయస్థాయి కరాటే పోటీలు**



పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణంరాజు సతీమణి శారదాదేవి, హీరో సుమన్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నేటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ కరాటే మార్షల్ ఆర్ట్స్ తప్పనిసరి అని సినీ హీరో సుమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్న కృష్ణంరాజు మెమోరియల్ జాతీయస్థాయి కరాటే పోటీలను ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మా ట్లాడారు. ప్రపంచంలోనే నెంబర్ వన్ క్రీడగా కరాటే వెలుగొందుతుందన్నారు. మహిళలకు ప్రత్యే కించి బాలికలకు మార్షల్ ఆర్ట్స్ ఒక ఆత్మరక్షణ క్రీడగా ఉపయోగపడుతుందన్నారు. కరాటేతో శారీరక పటుత్వం పెంపొందుతుందని, విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ కరాటేలో శిక్షణ పొందాలన్నారు. మరో అతిథి సినీ హీరో కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి మాట్లాడుతూ కరాటేతో మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం పెంపొం దుతాయన్నారు. పాఠశాల స్థాయిలో కరాటే ను ప్రభుత్వాలు తప్పనిసరి క్రీడగా చేయా లని సూచించారు. జాతీయస్థాయి పోటీల నిర్వాహకుడు, కాయ్ జాతీయ సంయుక్త కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోని 15 రాష్ట్రాల నుంచి వెయ్యి మంది క్రీడకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్ర మంలో సీఎస్‌కే చైర్మన్, కరాటే సంఘం జిల్లా అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఒలంపిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, కాయ్ చైర్మన్ కే వసంత్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌరు రాజిరెడ్డి, కరాటే సీనియర్ మాస్టర్ వేణుగో పాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడుగుల ప్రవీణ్, జిల్లా కార్యదర్శి ఆర్ ప్రసన్న కృష్ణ, కోశాధికారి వంగల శ్రీధర్, అన్వర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న చిన్నారులు

## రేపటి నుంచి కాచిగూడకు ప్రత్యేక రైళ్లు

కరీంనగర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి కాచిగూడకు ఆదివారం నుంచి ప్రత్యేక రైళ్లు నడిపునస్తున్నట్లు కరీంనగర్ రైల్వే స్టేషన్ మేనేజర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఆర్‌బీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఈ ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 24, 25, 26, 28 తేదీల్లో కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక రైలు బయలుదేరి మధ్యాహ్నం రెండు గంటలకు కాచిగూడకు చేరుకుంటుందన్నారు. తిరిగి మధ్యాహ్నం మూడు గంటలకు కాచిగూడ నుంచి బయలుదేరి రాత్రి 11.15 గంటలకు కరీంనగర్‌కు చేరుకుటుందని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# చిన్న వయస్సు.. పెద్ద మనసు

- బర్త్‌డే, డిసెంబరు 31 వేడుకలకు దూరం
- ఆ డబ్బుతో పేదలకు సేవా కార్యక్రమాలు
- జ్యోతిక, కౌశిక్‌ల ఉదారతకు ప్రశంసలు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో పురస్కారాలు



దివ్యాంగులకు వీల్‌చైర్ అందిస్తున్న జ్యోతిక, కౌశిక్

**పుట్టిన రోజు, డిసెంబరు 31 వేడకుల పేరిట డబ్బులు వృథా చేయవద్దని, ఆ డబ్బుతో పేదలకు ఏదైనా సహాయం చేయాలన్నది ఆ చిన్నారుల సంకల్పం. కరోనా విపత్తు సమయంలో పేదలు తిండి లేక పస్తులున్న నిస్సహాయ స్థితి వారిని కదలించింది. తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీని దాచి పెట్టి ఆ డబ్బులతో పేదలకు నిత్యావసర సరుకులను అందించారు సుల్తానాబాద్ పట్టణానికి చెందిన జ్యోతిక, కౌశిక్. వారి సేవాగుణానికి గుర్తించిన వివిధ సంస్థలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులతో సత్కరించాయి.**

సుల్తానాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వారి వయస్సు చిన్నదే అయినా మనసు పెద్దది. తమ పుట్టిన రోజు వేడుకలను, ఇయర్ ఎండింగ్ సెలబ్రేషన్స్ జరుపుకోకుండా ఆ డబ్బుతో పేదలకు సహాయం చేయాలని భావించారు. అలా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించి పలువురి మన్ననలు పొందారు. కరోనా సమయంలో ప్రైవేట్ పాఠశాలలు మూతపడడం, యాజమాన్యాలు వేతనాలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ టీచర్ల కుటుంబాల పోషణ భారంగా మారింది. ఈ నేపథ్యంలో దాదాపు 207 మంది టీచర్లకు పలువురు దాతల సహకారంతో నిత్యావసర సరుకులు అందించారు. కరోనా బాధితులకు సేవలందించారు. 167 మంది కరోనా పేషంట్లకు అవసరమైన పాలు, బ్రెడ్లు, పండ్లు అందించారు. అవసరమైన వారికి భోజనాలు సమకూర్చారు. టీచర్స్ డే సందర్భంగా ఉపాధ్యాయులకు ఏదైనా సహాయం చేయాలని వారు ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త స్పందన లభించింది.

**● పుట్టిన రోజు వేడుకలు మానుకుని..**

సుల్తానాబాద్ పట్టణంలోని ద్వారకానగర్‌కు చెందిన ఏగోలపు సదయ్య-సుజాత దంపతులకు ఇద్దరు సంతానం. కూతురు జ్యోతిక, కుమారుడు కౌశిక్‌లు తమ పదో ఏట నుంచి పుట్టిన రోజు జరుపుకోవడం మానుకొని వాటికయ్యే ఖర్చుతో పేదలకు ఏదైనా సేవ చేయాలని సంకల్పించారు. ఆర్థికంగా ఉన్న వారు కానీ, మధ్య తరగతి వారు కానీ తమ పిల్లల పుట్టిన రోజు పేరిట వేడుకలు నిర్వహించడం, వాటికి పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు చేయడం సరికాదని జ్యోతిక కౌశిక్‌లు భావించారు. అలాగే డిసెంబర్ 31 పేరిట వృథా ఖర్చు చేయవద్దని, ఆ డబ్బుతో పేదలకు సహాయం చేయాలని, తాము దీనిని ఆచరిస్తున్నామంటూ చేసిన చాలెంజ్ చాలా మంది పిల్లలను ఆలోచింపజేసింది. దాంతో వారు కూడా సేవా కార్యక్రమాలు చేపట్టారు.

**● పాకెట్ మనీతో పాటు దాతల సహకారం..**

తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీతో పాటు దాతల సహకారంతో జ్యోతిక, కౌశిక్‌లు సుల్తానాబాద్ పట్టణమే కాకుండా పెద్దపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా తమ సేవా కార్యక్రమాలను చేపట్టారు. అనేక మంది పేద విద్యార్థుల ఫీజులు చెల్లించి ఆదుకున్నారు. వికలాంగులకు అవసరమైన పరికరాలు అందించారు. పేదలకు నెలరోజుల పాటు సరిపడా నిత్యావసర సరుకులు సమకూర్చారు. పండుగల సందర్భంలో కొత్త బట్టలు అందించారు. చలికాలంలో అనాథలకు, యాచకులకు ఉన్ని దుస్తులు కొనిచ్చారు. ఇలా గత ఆరు సంవత్సరాల నుంచి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.



పేదలకు నిత్యావసర సరుకులు అందిస్తున్న చిన్నారులు (ఫైల్)

**● రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు**

జ్యోతిక, కౌశిక్‌లు చేస్తున్న సేవలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. అనేక సంస్థలు వీరికి అవార్డులు ప్రకటించి సన్మానాలు చేశాయి. ఎంతో మంది ప్రముఖులు వీరి ఉదారతను ప్రశంసించి సన్మానించారు.



జ్యోతిక, కౌశిక్‌లను సన్మానిస్తున్న సినీ నటుడు సుమన్ (ఫైల్)

## న్యూస్ బాక్స్

### వరి కొయ్యలను కాల్చొద్దు

ముస్తాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరి కొయ్యలను పొలాల్లో కాల్చవద్దని ముస్తాబాద్ మండల విద్యాధికారి అనూష అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో అనూష మాట్లడుతూ రైతులు పంట కోసిన తరువాత కొయ్యలను కాల్చివేస్తున్నారని, అలా కాల్చి వేస్తే దిగుబడి తగ్గుతుందని అన్నారు. పొలాల్లో కొయ్యలు కాల్చడంతో భూమికి మంచి చేసే పురుగులు చనిపోతాయన్నారు. కొయ్యలను కాల్చకుండా అలాగే దున్నితే ఎరువుగా మారి భూమికి బలం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రేవతి, వెంకటేశ్, నరేశ్, సౌమ్య, కీర్తన, అఖిల తదితరులు పాల్గొన్నారు.

### కరపత్రం ఆవిష్కరణ

గంభీరావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం మాలల, మాల ఉప కులాల ఆత్మగౌరవ సభ కర పత్రం ఆవిష్కరించారు. ఈ నెల 23న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించే మాలల మాల ఉపకులాల ఆత్మగౌరవ సభను విజయ వంతం చేయాలని పిలుపు నిచ్చారు. ముందుగా అంబేద్కర్ విగ్రహనికి పూల మాలలు వేశారు. అనంతరం చలో సిరిసిల్ల కర పత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అ ధ్యక్షుడు దోసల చంద్రం, ఉమ్మడి జిల్లా కార్యదర్శి దోసల ఉపేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు లక్కం బాబు, జిల్లా అధికార ప్రతినిధి పిట్ల రఘు, పట్టణ అధ్యక్షుడు జంగ రాకేష్, నాయకులు బండ నవీన్, గాదం శంకర్, బాలయ్య, సుదర్శన్, రామ చంద్రం, మనోజ్‌కుమార్, రాజు, శంకర్, బాలరాజు, శ్రీధర్, శివరాజం ఉన్నారు.

### ఎస్పీని కలిసిన నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన అనంతరం శుక్రవారం నూతన కార్యాలయం నుంచి విధులను నిర్వహిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కాంగ్రెస్ నాయకులు కలిశారు. పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య శుభాకాంక్షలు తెలిపారు.

### వాటర్ కూలర్ వితరణ

చందుర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి ): చందుర్తి మండలం ఎనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వేములవాడ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి మారెల్లి విక్రమ్ కుమార్ రెడ్డి వాటర్ కూలర్‌ను శుక్రవారం వితరణ చేశారు. రూ. 30,000 విలువ ఉంటుందన్నారు. ప్రధానోపాధ్యాయిని సునీతారాణి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గోదావరి పాల్గొన్నారు.

### పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎండపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్త పేట గ్రామంలో జిన్నింగ్ మిల్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సంవత్సరకాలం కష్టపడి పండించిన పత్తి పంటను ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు కొత్తపేటలోని జిన్నింగ్ మిల్‌లో అమ్ముకొని రైతులు గిట్టుబాటు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. రైతుల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి

కథలాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధిక సంఖ్యలో ఉన్నారని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని శుక్రవారం డీఎస్పీ నాయకులు తహసీల్దార్ వినోద్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దూలూరు గంగరాజం, సురేశ్, వంశీ, తిరుపతి, రమేశ్ ఉన్నారు.

# ఆహార పదార్థాల నాణ్యతపై దృష్టి సారించాలి

● కలెక్టర్ సందీప్ కుమార్ ఝా


విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

తంగళ్లపల్లి, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యాలయాల్లో ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం నేరెళ్ల లోని బాలికల గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యాలయం ఆవరణలో పరిశుభ్రత పనులను పరిశీలించారు. అనంతరం కిచెన్‌లోని కూరగాయలు, పండ్లు ఇతర పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. పలు కూరగాయలు, పండ్ల నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తుండగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వారి సందేహాలు నివృత్తి చేశారు. మండలంలోని నర్సింహులపల్లి, తంగళ్లపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ వహించి మ్యాథ్స్, సైన్స్ ఇంగ్లీష్ అంశాల్లో నిష్ణాతులను చేయాలని సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ కమిటీల నియామకం


రొండి రాజు


కనికరపు రాకేష్


చెలుకల తిరుపతి


బొజ్జ మల్లేశం

వేములవాడ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రూరల్ మండలం నాగాయపల్లికి చెందిన రొండి రాజును వైస్ చైర్మన్‌గా పట్టణానికి చెందిన కనికరపు రాకేష్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. డైరెక్టర్‌లుగా రాగిరి నాగరాజు, కమ్మం గణేష్, పాలకుర్తి పర్శరాములు, వస్తాద్ కృష్ణప్రసాద్, మనుపాటి పర్శరాములు, షేక్ షబీర్, మ్యాక స్రవంతి, కత్తి కనుకయ్య, చెరుకు శంకరయ్య, గుర్రం విద్యాసాగర్, దైత కుమార్, చీకోటి నాగరాజు, నాంపల్లి సింగిల్‌విండో చైర్మన్ బీరెడ్డి సల్మాన్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి, అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్‌ను నియమిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొంది.

రుద్రంగి : రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన చెలుకల తిరుపతి, వైస్ చైర్మన్‌గా చందుర్తి మండలానికి చెందిన బొజ్జ మల్లేశంను నియమించింది. సభ్యులుగా అల్లూరి సంతోష్‌రెడ్డి, మాడిశెట్టి ప్రభాకర్, అమరబండ సాయి, ఈసరి శ్రీనివాస్, గూగులోత్ గజన్, కరీమ్ అబ్దుల్, బానల లావణ్య, మర్రి కృష్ణ, ఇందూరి మదు, గోపిడి రవీందర్, ఎనుగుల లచ్చిరెడ్డి, నాగురం శంకరయ్య, మానల ప్యాక్స్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ ఆధికారి, వేములవాడ అగ్రికల్చర్ ఏడీ, రుద్రంగి పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌లను నియమిస్తున్నట్లు పేర్కొంది.

రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతిని సన్మానించారు. తర్రె మనోహర్, ఎర్రం గంగ నర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, మాడిశెట్టి అభిలాష్, ఇప్ప మహేష్, పూదరి మహిపాల్, ఎర్రం అరవింద్, అఖిల్, సాయి, గణేష్ పాల్గొన్నారు

## ముస్తాబాద్ ప్యాక్స్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం


అవిశ్వాసంపై సమావేశమైన డీసీవో రామకృష్ణ

ముస్తాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ సహకార సంఘం చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. ఇరవై రోజులుగా సాగిన ఉత్కంఠకు తెరపడింది. అవిశ్వాసం కోసం గత నెల 29వ తేదీన సంఘం అధ్యక్షుడిపై డైరెక్టర్లు అవిశ్వాస తీర్మాన నోటీసు అందజేశారు. ఈ నేపథ్యంలో దానికి సంబంధించి ప్రత్యేక పాలక వర్గాన్ని డీసీవీ రామకృష్ణ శుక్రవారం ఏర్పాటు చేశారు. సహకార సంఘ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఎనిమిది మంది డైరెక్టర్లు హాజరయ్యారు. కోరం నిండడంతో సమావేశాన్ని కొనసాగించారు. అవిశ్వాసం నెగ్గాలంటే తొమ్మిది సభ్యులు హాజరుకావాల్సి ఉండగా ఎనిమిది మంది మాత్రమే హాజరవడంతో వీగిపోయినట్లు డీసీవో ప్రకటించారు.

## సన్నాల సాగు వైపు మొగ్గు

వీర్నపల్లి, (ఎల్లారెడ్డిపేట) నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : యాసంగి సాగులో సన్న వడ్లను పండించేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో ఎక్కువ శాతం రైతులు సన్నవడ్లను ఖరీదు చేస్తున్నారన్నారు. సన్నరకం వడ్ల సాగుతో రైతులు ఆర్థికంగా ఎదుగుతారన్నారు.

## పలువురికి ప్రభుత్వ విప్ పరామర్శ

చందుర్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలోని కిష్టంపేట, లింగంపేట ఇటీవల మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించారు. కిష్టంపేట గ్రామానికి చెందిన మ్యాదరి లస్మవ్వ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను, కట్టా లింగంపేటలో మోకాలు శాస్త్ర చికిత్స చేయించుకున్న బైరినేని అంజన్‌రావును పరామర్శించారు. లింగంపేట గ్రామంలో ఆరోగ్యంతో బాధపడుతున్న లచ్చయ్యకు చికిత్స నిమిత్తం రూ.2లక్షల 50 వేలు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరు చేయించారు.

# ఆధునిక సాంకేతిక విధానాలను అందిపుచ్చుకోవాలి

కథలాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయరంగంలో చోటు చేసుకుంటున్న పరిమాణాల నేపథ్యంలో రైతాంగం ఆధునిక విధానాలను అందిపుచ్చుకుని సాగుకు ఉపక్ర మించాలని జిల్లా ఏరువాక కేంద్రం డైరెక్టర్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం వ్య వసాయ ప్రదర్శన యాసంగిలో పంటల సాగు ప్రణాళికపై రైతులతో రైతు సదస్సు నిర్వహించారు. మారుతున్న వాతావరణ పరిస్థితు లకు అనుగుణంగా పంటల సరళిని మార్పు కు ని అధిక ఆదాయాలను ఇచ్చే పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. వరికొయ్యలను తగు లబె ట్టకూడదని ఎరువుల యాజమాన్యం పాటించాలని కోరారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ విద్యా ర్థులు వ్యవసాయ ప్రదర్శన ఏర్పాటు చేసి వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. శాస్త్రవేత్తలు మధుకర్‌రావు, శ్రావణి, రాజేంద్రప్రసాద్, వెంకట్రావు, ఏవో యోగిత, ఏఈఓలు శేఖర్, మౌనిక, హరీశ్ ఉన్నారు.


జిల్లా ఏరువాక కేంద్రం డైరెక్టర్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె నోటీసు


వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

సుభాష్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయడంతో పాటు ఇతర సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించాలని లేకుంటే నిరవధిక సమ్మెలోకి వెళతామని తెలంగాణ సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం సమ్మె నోటీసు అందజేసింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గుండ రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి మహేశ్ మాట్లాడుతూ సమగ్రశిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు పేస్కేలు ఇవ్వాలని, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10లక్షలు, ఆరోగ్య బీమా కల్పించాలని, ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి, చేసిన వారికి బెనిఫిట్స్ కింద రూ. 25లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వ, విద్యాశాఖ చేపట్టే నియామకాల్లో తమకు వెయిటేజీ కల్పించాలని, పీటీఐలకు 12నెలల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం 15 రోజుల్లో పరిష్కరించని పక్షంలో సమ్మెలోకి వెళతామని తెలిపారు.

## సమాచారం.. గోప్యం

5వ పేజీ తరువాయి..

ఇతర ఆధారం లేకుండా రోడ్లపై తిరుగుతూ భిక్షాటన చేస్తూ చెట్ల కింద, నిరుపయోగంగా ఉన్న భవనాల వద్ద నివసించే కుటుంబాల వివరాలను సేకరించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేశారు. సమగ్ర కుటుంబ సర్వే కోసం జిల్లాలో 1,92,432 కుటుంబాలకు సంబంధించిన వివరాలను సేకరించడానికి 1531 బ్లాకులుగా విభజించారు. 1333 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. ఒక ఎన్యూమరేటర్ 150 కుటుంబాల వరకు సర్వే చేసే విధంగా ప్లాన్ చేశారు. ఈ నెల 9న ప్రారంభమైన వివరాల సేకరణ పూర్తి స్థాయిలో ప్రతీ కుటుంబం వద్దకు వెళ్లి సేకరించారు. అంతకుముందు 1వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి కుటుంబాలను గుర్తించి స్టిక్కర్లు వేశారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సర్వేను పర్యవేక్షించారు. ఎన్యూమరేటర్లకు ఇతర సిబ్బందికి కావాల్సిన మెటీరియల్, ఇతర శిక్షణను సీపీవో శ్రీనివాసచారి ఆధ్వర్యంలో అందజేశారు.

### 450 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు

జిల్లాలో ఇంటింటి సర్వే ముగుస్తుండడంతో సేకరించిన వివరాలను ఆన్‌లైన్ చేయడానికి ప్రభుత్వం సాఫ్ట్‌వేర్‌ను అందించింది. సాఫ్ట్‌వేర్ ప్రకారం డేటా ఎంట్రీ చేయడానికి 450 మంది ఆపరేటర్లను నియమించారు. వీరికి శనివారం శిక్షణ అందిస్తారు. శిక్షణ ఇచ్చిన తరువాత ప్రతీ మండల కేంద్రంలో రెండు సెంటర్ల ద్వారా వివరాలను ఆన్‌లైన్ చేస్తారు. వివరాలు పకడ్బందీగా నమోదు చేయడంపై దృష్టి పెట్టారు.

### డోర్ లాక్ ఇళ్ల వివరాలపై సందిగ్ధం

జిల్లాలో ఇంటింటి సర్వేలో ఎన్యూమరేటర్లు డోర్ లాక్ సమస్యను ఎదుర్కొన్నారు. కుటుంబ సర్వే సమయంలో కొన్ని ఇళ్లకు తాళాలు వేసి ఉన్నాయి. ఇందులో ఉద్యోగ, ఉపాధికి సంబంధించి వెళ్లనవారు ఉన్నారు. దీంతో అనుకున్న స్థాయిలో కొన్ని కుటుంబాల వివరాలు రాన్నట్లు తెలుస్తోంది. ఎట్టకేలకు సర్వే ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక డేటా ఎంట్రీపై దృష్టి సారించారు.

### ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి


మాట్లాడుతున్న జిల్లా ఉపవైద్యాధికారి అంజిలా ఆల్ఫ్రెడ్

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా ఉపవైద్యాధికారులు డాక్టరు అంజిలా ఆల్ఫ్రెడ్, డాక్టరు రజిత అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ఎంసీహెచ్, ఎన్‌సీడీపై శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మొదటి 84 రోజుల్లో గర్భిణి వివరాలు నమోదు చేసి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయాలన్నారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీకి సంబంధించిన వారిపై సిబ్బంది ప్రతిరోజు దృష్టి పెట్టాలన్నారు. ఐరన్ పోలిక్ మాత్రలను అందజేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో ఎంసీహెచ్ కోఆర్డినేటర్ బాలచందర్, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ సత్యనారాయణ, హెచ్‌ఈవో బాలయ్య, ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్రవంతి, డాక్టర్ చిరంజీవి పాల్గొన్నారు.

### ఆలయ ఉద్యోగులకు పదోన్నతులు


నియమాక పత్రాలను అందిస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):వేములవాడ రాజన్న ఆలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న పలువురు ఉద్యోగులకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పదోన్నతులు కల్పిస్తూ శుక్రవారం నియమాకపు పత్రాలను అందజేశారు. ఆలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న పోతారం శ్రీనివాస్, శివకుమార్, సుశీల్, అజయ్‌కుమార్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ నియమాక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రావణ్, సూపరింటెండెంట్ పూజిత, సీనియర్ అసిస్టెంట్ వంశీ ఉన్నారు.

### హమాలీ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

కోనరావుపేట, నవంబజుజీ 22 (ఆంధ్రజ్యోతి) : హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని హమాలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. కోనరావుపేట మండలం కొండాపూర్‌లో శుక్రవారం హమాలీల సమస్యలను తెలుసుకొని మాట్లాడారు. హమాలీ కార్మికులకు తాడు మామూలు లారీ యజమాలు ఇచ్చేవారని, ఇప్పుడు తాడు మామూలు ఇవ్వడం లేదని అన్నారు. హమాలీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలని కోరారు.

### తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

వీర్నపల్లి, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండల కేంద్రంలోని పద్మనగర్, గణేష్ నగర్ కాలనీలలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్ తెలిపారు. మండల కేంద్రంలో కాలిపోయిన బోరు మోటర్‌కు మరమ్మత్తులు చేయించి శుక్రవారం మోటార్ బిగించారు. ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారి మరమ్మత్తు పనుల వల్ల అక్కడక్కడ పైప్‌లైన్ పగిలిపోవడంతో తాగునీటి సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. తాగునీటికి ఇబ్బందులు కలగకుండా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామని, ప్రజలందరూ సహకరించాలని ఏఈ కోరారు.

# గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం


సభ్యత్వ నమోదు చేపట్టిన నాయకులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల అభివృద్ధి గతంలో టీడీపీతోనే సాధ్యమైందని తెలుగుదేశం పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి ఆవునూరి దయాకర్ రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న కాలంలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. ఆనాడు ఎన్టీఆర్ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం పనిచేశారన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో పేదలకు అనేక సంక్షేమ పథకాలను అందించారని, గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వాలు చేపట్టి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు చెట్క్యారి నారాయణ గౌడ్, సిరిసిల్ల నియోజకవర్గం అడహక్ కమిటీ సభ్యులు తీగల శేఖర్ గౌడ్, జిల్లా నాయకుడు మాలోతు సూర్య నాయక్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధికార ప్రతినిధి లొంక భాస్కర్ శర్మ, రంగారావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ భరోసా

వీర్నపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద కుటుంబాల మెరుగైన వైద్యానికి భరోసానిస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో రూ.3 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పట్టణ అధ్యక్షుడు చెన్ని బాబు ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలకు కార్పొరేట్ అందించేందుకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌వోసీలను మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, డైరెక్టర్లు చిన్న లక్ష్మి, బుచ్చ గౌడ్, జిల్లా కార్యదర్శి వంగ గిరి రెడ్డి, ఎస్సీ సెల్ కార్యదర్శి గోపాల్, తిరుపతి గౌడ్, మేగి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వంగ శివరాంరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇల్లందుల శ్రీనివాస్ రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ ల్యాగల సతీష్, నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పలువురికి అందజేశారు. 23 మందికి రూ.11 లక్షల పై చిలుకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, ఏఎంసీ డైరెక్టర్ ప్రభాకర్, నాయకులు మల్యాల రాజవీర్, బంగ్ల రాజు, సుస్రత్, రాజశేఖర్, మల్లయ్య, ప్రసాద్, లక్కం బాబు తదితరులు ఉన్నారు.


చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

# సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తంగళ్లపల్లి, నవంబరు 22 ( ఆంధ్రజ్యోతి): మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులో తంగళ్లపల్లి మండలం మండెపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ పరీక్షలో 10వ తరగతి విద్యార్థి శ్రీవిద్య, 9వ తరగతి విద్యార్థి స్రుహిత్, 8వ తరగతి విద్యార్థి ఎస్.కె అయాన్ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఎంఈవో రాజు నాయక్, ప్రిన్సిపాల్ విఠల్, సైన్స్ ఉపాధ్యాయులు సాగర్, హరీష్, అరవింద్, రమేష్, శ్రీనివాస్ తదితరులు అభినందించారు

వీర్నపల్లి, (ఎల్లారెడ్డిపేట): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్లారెడ్డిపేట మండల స్థాయి చెకుముకి టాలెంట్ పరీక్షలలో రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని జ్ఞానదీప్ హైస్కూల్ విద్యార్థులు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్న విద్యార్థులకు మండల వనరుల కేంద్రంలో ప్రశంస పత్రాలను శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మిట్టపల్లి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.